అవకాశం లేనప్పుడు అవిశ్వాసం ఎందుకు!

- వెనక్కి తగ్గిన బీజేపీ
- బడంగ్‌పేట కార్పొరేషన్ వార్షికోత్సవ వేడుకలు
- కలివిడిగా కార్పొరేటర్లు..!

సరూర్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మొన్నటిదాకా ఒకరిపై ఒకరు కత్తులు దూసుకున్నట్టు కనిపించిన బడంగ్‌పేట్ కార్పొరేషన్ కార్పొరేటర్లు.. పాలకమండలి నాలుగో వార్షికోత్సవం రోజు ఒక్కటిగా కలిసిపోయారు. మేయర్‌పై అవిశ్వాసానికి రంగం సిద్ధం చేసినట్టు జరిగిన ప్రచారం ఏమోగానీ.. శనివారం నాటి దృశ్యాలు మాత్రం అందుకు భిన్నంగా కనిపించాయి. కాంగ్రెస్‌కు చెందిన మేయర్ పారిజాతా నర్సింహారెడ్డి, బీఆర్ఎస్‌తో జత కలిసిన ఇండిపెండెంట్ డిప్యూటీ మేయర్ శేఖర్‌తో పాటు అన్ని పార్టీల కార్పొరేటర్లు వార్షికోత్సవంలో ఉత్సాహంగా గడపడం గమనార్హం!


వార్షికోత్సవంలో కేక్ కట్ చేస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు

ఇద్దరికైతే సై.. ఒకరికైతే నై... బీజేపీ నిర్ణయం

బడంగ్‌పేట్‌లో మేయర్‌పై అవిశ్వాసానికి సిద్ధంగా ఉన్నా తమకు పదవి ఇవ్వడానికి బీఆర్ఎస్ నేతలు సుముఖత వ్యక్తం చేయకపోవడంతో బీజేపీ సభ్యులు అవిశ్వాసం విషయంలో వెనక్కి తగ్గినట్టు తెలుస్తోంది. తమకు ఏదో ఒక పదవి కావాలంటే డిప్యూటీ మేయర్‌పైనా అవిశ్వాసం పెట్టాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. ఎమ్మెల్యే సబితారెడ్డి మాత్రం డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసానికి మొగ్గు చూపడంలేదని తెలిసింది. ఆయన తమ పార్టీకి చెందిన సభ్యుడు కానప్పటికీ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన తనకు బహిరంగంగా మద్దతు ప్రకటించిన నేపథ్యంలో శేఖర్‌పై అవిశ్వాసం వద్దని సబిత స్పష్టం చేస్తున్నారు. ఒకవేళ మేయర్‌పై అవిశ్వాసం నెగ్గినా ఆ పదవి సైతం తమకే (బీఆర్ఎస్) కావాలని ఆ పార్టీ సభ్యులు పట్టుబడుతున్నారు. దాంతో తమకు అటు మేయర్ పదవి, ఇటు డిప్యూటీ మేయర్ పదవి దక్కే అవకాశం లేనప్పుడు అవిశ్వాసం పెట్టడం వల్ల ఏం ఉపయోగమని బీజేపీ సభ్యులు మథనపడుతున్నారు. ఈ క్రమంలో ఇద్దరిపై అవిశ్వాసానికి ఓకే అంటున్న బీజేపీ సభ్యులు ఒకరిపై అవిశ్వాసానికి మాత్రం నో చెబుతున్నారు. బీజేపీ వెనకడుగు వేస్తే బీఆర్ఎస్‌కు తగినంత సంఖ్యాబలం లేనందున అవిశ్వాసం అంశం అటకెక్కినట్టేనని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

అంతా కలిసిపోయినట్టేనా..!?

సాధారణంగా ఓ పార్టీ సభ్యుడిపై అవిశ్వాసం పెట్టే అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో ఇరు పార్టీల సభ్యులు ముభావంగా ఉంటూ సంబరాలకు దూరంగా ఉంటుంటారు. బడంగ్‌పేట్‌లో మాత్రం శనివారం తద్విరుద్ధ దృశ్యాలు గోచరించాయి. ఇక్కడి పాలకమండలి కొలువుదీరి నాలుగేళ్లయిన సందర్భంగా శనివారం మునిసిపల్ నూతన భవనంలో వేడుకలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్, డిప్యూటీ మేయర్ సహా అన్ని పార్టీల సభ్యులు కలివిడిగా తిరుగుతూ ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుంటూ చలాకీగా గడిపారు. మేయర్, డిప్యూటీ మేయర్, ఇతర కార్పొరేటర్లు కలిసే కేక్ కట్ చేయడం గమనార్హం!

కొసమెరుపు

2014లో కొలువుదీరిన అప్పటి బడంగ్‌పేట్ నగర పంచాయతీ పాలకవర్గం సైతం నాలుగేళ్ల పదవీ కాలం పూర్తయిన సందర్భంగా 2018 జూలైలో ఘనంగా నాలుగో వార్షికోత్సవాన్ని జరుపుకుంది. అయితే ఊహించని విధంగా అప్పటి మునిసిపల్ చైర్మన్ సామ నర్సింహగౌడ్‌పై (ఆయన కాంగ్రెస్‌లో గెలిచి బీఆర్ఎస్‌లో చేరారు) నాటి మాజీ ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రోద్బలంతో కాంగ్రెస్ సభ్యులు అవిశ్వాసం పెట్టారు. ప్రస్తుత కార్పొరేషన్ పాలకవర్గం సైతం ఉత్సాహంగా నాలుగో వార్షికోత్సవం జరుపుకున్నప్పటికీ లోలోపల మంతనాలు జరిపి చివరకు అవిశ్వాస తీర్మానం పెడతారేమో.. అనే గుసగుసలు వినిపిస్తుండడం కొసమెరుపు!


కాలనీ ప్రతినిధుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హుడా భారతీనగర్ కాలనీ పార్కు సుందరీకరణ

- ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని హుడా భారతీనగర్ కాలనీ పార్కును సుందరీకరించి, వాకర్స్ కోసం ట్రాక్ ఏర్పాటు చేస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పార్కును సందర్శించి మహిళలు, కాలనీ ప్రతినిధుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్కు స్థలంలో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటామని, ఆకతాయిల ఇబ్బందులు లేకుండా మహిళల రక్షణ కోసం సాయంత్రం వేళల్లో పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. పార్కు ప్రహరీ ఎత్తు పెంచనున్నట్లు తెలిపారు. దేశంలోనే ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో అత్యధిక పార్కులు ఉన్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఆందోజు సత్యంచారి, నాయకులు, కాలనీ ప్రతినిధులు, మహిళలు పాల్గొనారు.


పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆనంద వేలును సన్మానిస్తున్న గ్రేటర్ హైదరాబాద్ అఖిల భారత యాదవ మహాసభ ప్రతినిధులు

పద్మశ్రీ ఆనందవేలుకు సన్మానం

సంతోష్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆనందవేలును గ్రేటర్ హైదరాబాద్ అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. పద్మశ్రీ ఆనంద వేలుకు తెలంగాణ ప్రభుత్వం 500 గజాల స్థలాన్ని కేటాయించి, కోటి రూపాయల నగదు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ హైద్రాబాద్ అఖిల భారత యాదవ మహాసభ ప్రతినిధులు మైల్‌కోల్ మహేందర్ యాదవ్, రాజేందర్‌యాదవ్, సందీప్‌యాదవ్, యువన్ యాదవ్ పాల్గొన్నారు.


బంగారు పతకాలతో ఆరుష్, అవ్యుక్త్

నేషనల్ తైక్వాండోలో ఆరుష్, ఆవ్యుక్త్‌కు బంగారు పతకాలు

చాదర్‌ఘాట్. జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో జరిగిన నేషనల్ తైక్వాండో చాంపియన్ షిప్ 2024లో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన కావేటి ఆరుష్, కావేటి ఆవ్యుక్త్ బంగారు పతకాలు సాధించారు. వీరు రమాదేవి పబ్లిక్ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్నారు. 10 సంవత్సరాల్లోపు 60 కిలోల క్యాటగిరిలో ఆరుష్, 55 కిలోల క్యాటగిరిలో ఆవ్యుక్త్ స్వర్ణ పతకాలను కైవసం చేసుకున్నారు. నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాలు సాధించడం వీరికి ఇదే ప్రథమం.


కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

సమస్యల పరిష్కారమే ధ్యేయం : కార్పొరేటర్

కొత్తపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. ఆదివారం ఎస్‌బీహెచ్ కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీల్లో పాత పైప్‌లైన్లతో డ్రైనేజీ, తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఎస్‌బీహెచ్ కాలనీలో వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తామని, పారిశుధ్య కార్మికులు విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



విద్యార్థినులను అభినందిస్తున్న మైనారిటీ వెల్ఫేర్ అధికారి కాశీం

గురుకుల కళాశాలలో విద్యార్థులకు వీడ్కోలు

మన్సూరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎల్‌బీనగర్, సూర్యోదయనగర్ కాలనీలోని తెలంగాణ మైనారిటీ గురుకుల కళాశాల (బాలానగర్ గర్ల్స్-1)లో ఇంటర్మీడియట్ సీనియర్ విద్యార్థులకు ఆదివారం వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి కాశీం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇంటర్మీయట్ తరువాత విద్యార్థినులు ఎంచుకోవాల్సిన కోర్సులు, భవిష్యత్తులో వారికి లభించే ఉపాధి అవకాశాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వినీల పాల్గొన్నారు.

హయత్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లు బదిలీ

హయత్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ సీఐ హెచ్.వెంకటేశ్వర్లు మహేశ్వరానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. వెంకటేశ్వర్లు 2022 జనవరి 21న హయత్‌నగర్ సీఐగా వచ్చారు. హయత్‌నగర్ డీఐగా పనిచేస్తున్న ఆర్.నిరంజన్ ఎస్‌ఓటీ-1కు బదిలీ అయ్యారు.



అలూమ్ని మీట్‌లో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థి, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



తనకు పాఠాలు నేర్పిన ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న మహబూబ్‌నగర్ కలెక్టర్ శశాంక్

స్వామి వివేకానంద హైస్కూల్‌లో అలూమ్ని మీట్

- పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చాదర్‌ఘాట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్‌లోని స్వామి వివేకానంద సెంటినరీ హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థులతో అలూమ్ని మీట్-2024 సమ్మేళనం జరిగింది. 1972 నుంచి 2007 వరకు పాఠశాలలో పదో తరగతి చదివిన సుమారు 8 వందల మంది పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పలకరించుకుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 1982 బ్యాచ్‌కు చెందిన ఎర్రం సురేష్ పూర్వ విద్యార్థులను ఒక వేదికపైకి తీసుకురావడంలో కృషిచేశారు. పూర్వ విద్యార్థుల్లో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్, మహబూబ్‌నగర్ జిల్లా జడ్జి ఆకెళ్ల శ్రీదేవి, క్రిమినల్ కోర్టు న్యాయమూర్తి ప్రేమవతి, జ్యుడిషియల్ అకాడమీ న్యాయమూర్తి మల్లిక్ సుబ్రహ్మణ్యం ఉన్నారు. పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రకటించారు. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ శశాంక్ తనకు పాఠాలు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించి ఆశీర్వాదాలు పొందారు.

పాఠశాల పునరుద్ధరణకు చేయూత

శిథిలావస్థకు చేరిన హైస్కూల్ పునరుద్ధరణకు పూర్వ విద్యార్థులు సహాయ, సహకారాలు అందించేందుకు ముందుకొచ్చారు. స్కూల్ నూతన భవనం నిర్మాణంతో పాటు విద్యార్థుల కోసం కంప్యూటర్ ల్యాబ్, తరగతి గదుల్లో అవసరమైన ఫర్నిచర్, వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు హామీఇచ్చారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

- విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుంకోజు

ఎల్‌బీనగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చేతి వృత్తుల వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని తెలంగాణ విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుంకోజు కృష్ణమాచారి పిలుపునిచ్చారు. విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం, కమ్మరి వడ్రంగి చేతి వృత్తుల సేవా సంస్థల రాష్ట్ర కమిటీ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం సరూర్‌నగర్ కుమ్మరి సంక్షేమ సంఘం భవనంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్మరి, వడ్రంగి వృత్తిదారులకు 50 సంవత్సరాలకే పింఛన్ మంజూరు, నిరుపేద కుటుంబాలకు ఇళ్ల కేటాయింపు, వృత్తిదారులకు సబ్సిడీ రుణాల కోసం పోరాడదామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కుందారం గణేష్‌చారి, యర్రవెల్లి బాలచారి, సలహాదారులు అందోజు రవీంద్రచారి, ప్రధాన కార్యదర్శి రాళ్లబండి విష్ణుచారి, కోశాధికారి తాటికొండ శ్రీరాములుచారి, రమేష్‌చారి, ఉపేంద్రచారి, వెంకటేశం, కృష్ణమాచారి, రాజన్న, బ్రహ్మాచారి, మహిళా కోశాధికారి వాణి, ప్రచార కార్యదర్శి వెలకుర్తి చంద్రశేఖరాచారి, శ్రీనివాస్‌చారి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు అశోక్‌చారి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వెంకటాచారి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు నర్సింహాచారి, సికింద్రాబాద్ అధ్యక్షుడు మల్లేశం చారి, ఎల్‌బీనగర్ విశ్వబ్రాహ్మణ అధ్యక్షుడు శ్రీనివాసాచారి, గౌరవాధ్యక్షుడు రామాచారి, మురళీధర్‌చారి, వెంకటాచారి, సింహాద్రిచారి పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరించిన నాయకులు

వైభవంగా గీతా జ్ఞానయజ్ఞం

ఎల్‌బీనగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం కర్మన్‌ఘాట్‌లోని శ్రీ లక్ష్మీ కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్న 1917వ శ్రీ సర్వ సౌభాగ్య దేవిత్రయ గీతా జ్ఞాన యజ్ఞం పూర్ణాహుతి ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివపార్వతుల శాంతి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. సహస్రదీపోత్సవం, వేద పారాయణం, మహా నివేదన, మంగళహారతి, రాజోపచారం జరిపించారు. యజ్ఞ నిర్వాహకులు బ్రహ్మర్షి మురుకుంట్ల రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన యజ్ఞ పూర్ణాహుతిలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్, ఐబీఎఫ్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్త, బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, సూరిశెట్టి శివయ్యగుప్త, సూరిశెట్టి శ్రీనివాస్‌గుప్త, సూరిశెట్టి సురేష్ గుప్త, సూరిశెట్టి శశిధర్‌గుప్త, బాలరాజుగుప్త, శ్రీనివాస్‌గుప్త, కాంగ్రెస్ నాయకులు రేణురెడ్డి, ఎం.చెన్నారెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.


యజ్ఞంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ కృషి

- ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్

సంతోష్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఐఎస్‌సదన్, వినయ్‌నగర్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం యాకుత్‌పుర నియోజకవర్గానికి చెందిన దర్శనం పవన్, వెంకట్ రుద్రగౌని ఆధ్వర్యంలో పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆరు సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ఫిరోజ్‌ఖాన్, వెంకటేష్ ముదిరాజ్, అలీ మస్కతి, బొల్లు కిషన్ పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న దర్శనం పవన్, వెంకట్ రుద్రగౌని

సందర్శకులతో కిటకిటలాడిన జూపార్కు

మదీన, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జూపార్కులో ఆదివారం సందర్శకుల సందడి కనిపించింది. సెలవు దినం కావడంతో నగరం నుంచే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుంచి కూడా సందర్శకులు వచ్చారు. సుమారు 17 వేల మంది జూను తిలకించారు. జంతువులను దగ్గరి నుంచి చూసి ఆనందం వ్యక్తం చేశారు. చిన్నారులు టాయ్ ట్రైన్‌లో కూర్చుని జూను చూస్తూ కేరింతలు కొట్టారు. స్నేక్ సెల్ సొసైటీ వాలంటీర్లు 'స్నేక్ షో' నిర్వహించి పాముల గురించి, వాటిలోని రకాలు, వాటి జీవనశైలి తదితర అంశాల గురించి సందర్శకులకు అవగాహన కల్పించారు.


జూపార్కులో కిక్కిరిసిన జనం

30న రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

చాదర్‌ఘాట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీ-2024 ఆవిష్కరణ కార్యక్రమం ఈనెల 30న చైతన్యపురిలోని సాయినగర్‌లో గల సీనియర్ సిటిజన్ సేవా సమితిలో నిర్వహించనున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు మారం భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ ఎం.కోదండరాం, జాతీయ పెన్షనర్స్ ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ డి.సుధాకర్, మాజీ అధ్యక్షుడు టి.గోపాలకృష్ణమూర్తి గౌరవ అతిథులుగా విచ్చేయనున్నారు.

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నరసింహారెడ్డి




హయత్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా హయత్‌నగర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కళ్లెం నరసింహారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కళ్లెం నరసింహారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీగౌడ్, జిల్లా అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, ఎల్‌బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.


ఉమర్‌ఖాన్‌గూడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కౌన్సిలర్ శ్రీలత

భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

హయత్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని ఉమర్‌ఖాన్‌గూడలో నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు ఆదివారం కౌన్సిలర్ కడారి శ్రీలత అనిల్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దశల వారీగా అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, మల్లారెడ్డి, వెంకటేశ్‌గౌడ్, దానయ్య, లక్ష్మారెడ్డి, బాలుగౌడ్ పాల్గొన్నారు.


మీర్‌పేట్, ప్రశాంతిహిల్స్‌లోని శ్రీద్వారకామాయి సాయిబాబా పీఠాన్ని ఆదివారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ ఆర్.ఆర్.గిరీశ్‌కుమార్ సందర్శించారు. పీఠాధిపతి శ్రీగోపాలకృష్ణానందస్వామీజీ ఆయనతో ప్రత్యేక పూజలు చేయించారు. (సరూర్‌నగర్, ఆంధ్రజ్యోతి)


ప్రశంసా పత్రాన్ని అందజేసిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

అపోలో ఆరోగ్య శ్రీ, ఆయుష్మాన్ భారత్ సేవలకు గుర్తింపు

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన ఆరోగ్య యోజన కింద అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అందిస్తున్న సేవలకు గుర్తింపు లభించింది. అపోలో సేవలను గుర్తిస్తూ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అనుదీప్ దుర్గిశెట్టి అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ రీసెర్చ్ సీవోవో అపర్ణారెడ్డికి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ ఇనిస్టిట్యూట్ రెండు దశాబ్దాలుగా రాష్ట్రంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన కింద అనేక మంది రోగులకు చికిత్స అందించినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంకట్ దీపక్ చోడిపల్లి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ మహబూబ్ పాషా, జాయింట్ కలెక్టర్ మధుసూదన్, ఏఐఎంఎస్ఆర్ సీనియర్ మెడికల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ రాజేష్, అడ్మిన్ ఆఫీసర్ సునీల్ పాల్గొన్నారు.